ప్రజాశక్తి
గురువారం 28 డిసెంబర్ 2023
5
విజయనగరం

నూర్పిడి యంత్రంలో నలిగిన బతుకులు

తెర్లాం మండలంలోని అంట్లవార గ్రామంలో విషాదం అలముకుంది. బుధవారం పొలంలో వరి చేను నూర్పిడి పనికి వెళ్లిన అదే గ్రామానికి చెందిన ఏడుగురు రైతు కూలీ మహిళలు తిరిగి ఇంటికి వస్తుండగా నూర్పిడి వాహనం బోల్తాపడడంతో గంటా రమణమ్మ (35), భీమసింగ్ శాంతి (37) అక్కడిక్కడే మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదం అలముకుంది.

మృతులు రమణమ్మ, శాంతి (ఫైల్)

వివరాలు ...మెయిన్‌లో

ప్రభుత్వ నాన్చుడి ధోరణిపై

భగ్గుమన్న అంగన్వాడీలు

ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి • బొత్స క్యాంపు కార్యాలయం వద్ద సొమ్మసిల్లిన ఆయా

బొబ్బిలి : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్వాడీలు

గరివిడి : మంత్రి బొత్స క్యాంపు కార్యాలయం వద్ద బైఠాయించి భోజనాలు చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి–చీపురుపల్లి

'అదిరిస్తాం.. బెదిరిస్తాం అంటే అదిరిపోయేది బెదిరిపోయేది ఎవరూ లేరు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గేది లేదు' అంటూ అంగన్‌వాడీలు కదం తొక్కారు. అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్రనాయకులతో ప్రభుత్వం చేసినచర్చలు విఫలం కావడంతో బుధవారం ఎమ్మెల్యేల ఇళ్లను అంగన్‌వాడీలంతా ముట్టడించారు. తమ సమస్యలను ఎమ్మెల్యేల వద్ద ఏకరువు పెట్టారు. స్పందించిన ఎమ్మెల్యేలు సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రికి లేఖలు రాస్తామని హామీ ఇచ్చారు.

గరివిడిలోని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయాన్ని అంగన్‌వాడీలంతా ముట్టడించారు. సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వరలక్ష్మి, మాలతీ ఆధ్వర్యాన వందలాదిగా కదలివచ్చారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం ఆగదని అన్నారు. భారీగా తరలి వచ్చిన అంగన్‌వాడీలు ఒక్కసారిగా మంత్రి ఇంటిని ముట్టడించే యత్నం చేసారు. దీంతో సిఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు దామోదరరావు, సన్యాసినాయుడలు వారిని నియంత్రించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు టివిరమణ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని 16 రోజుల నుంచి అంగన్‌వాడీల నిరవధిక సమ్మె చేస్తుంటే చర్చల పేరుతో మంత్రి బొత్స సత్యన్నారాయణ పిలిచి అదిరించడం బెదిరించడం మంచి పద్ధతి కాదని అన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించాలని, కవ్వింపు చర్యలకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

సొమ్మసిల్లిన అంగన్‌వాడీ హెల్పర్ వరలక్ష్మి

ఇంటి ముట్టడి సమయంలో ధర్నాలో పాల్గొన్న గుర్ల మండల ప్రాజెక్టు పరిధిలోని గొలగాం గ్రామానికి చెందిన మంత్రి వరలక్ష్మి అనే అంగన్‌వాడీ హెల్పర్ సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో అక్కడున్న తోటి అంగన్ వాడీలు, పోలీసులు స్పందించి హుటాహుటిన వరలక్ష్మిని ఆసుపత్రికి తరలించారు. తరువాత ఆమె కోలుకుంది.

రాజాం : ఎమ్మెల్యే కంబాల జోగులు ఇంటిని అంగన్‌వాడీలంతా ముట్టడించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తినాయుడు మాట్లాడారు ఎమ్మెల్యే లేకపోవడంతో ఆయన కార్యాలయ సిబ్బందికి వినతినిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉమా కుమారి, శ్రీదేవి, పుణ్యవతి, కాలిరత్నం, జయలక్ష్మి ,సునీత, భారతి, చిన్నమ్మడు, నిర్మల, శ్రీదేవి, ధవలేశ్వరి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి లేఖ రాస్తాం : కోలగట్ల

విజయనగరంటౌన్ : అంగన్‌వాడీలంతా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల నివాసం వద్ద ఆందోళన చేపట్టారు. పోలీసులు భారీ ఎత్తున మొహరించి అంగన్వాడీలను నిలువరించేందుకు ప్రయత్నం చేయడంతో కొద్దిపాటి ఘర్షణ వాతావరణం నెలకొంది. కోలగట్ల స్పందించి అంగన్‌వాడీలందరినీ లోపలకు పిలవడంతో అంగన్వాడీలు తమ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. స్థానికంగా ఏమైనా సమస్యలుంటే తాను పరిష్కరించగలనని, పైస్థాయిలో ఉన్నందున ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చి అక్కడిక్కడే లేఖ రాసి ఫ్యాక్స్‌లో పంపించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు బి. సుధారాణి, నగర కార్యదర్శి బి.రమణ మాట్లాడుతూ ప్రభుత్వం మొండిగా ఉంటే పోరాటాన్ని మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్, నగర కార్యదర్శి సుంకర సతీష్, తదితరులు మద్దతు ప్రకటించారు.

కొత్తవలస : ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న అంగన్వాడీలు

రాజాం : ఎమ్మెల్యే జోగులు ఇంటి వద్ద అంగన్వాడీల ఆందోళన

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి

బొబ్బిలి : ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు క్యాంపు కార్యాలయాన్ని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ముట్టడించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్వాడీలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

డెంకాడ : నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ స్వగ్రామం మోపాడలో ఆయన నివాసం వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేశారు. సిఐటియు నాయకులు బి.సూర్యనారాయణ ఆధ్వర్యాన ఎమ్మెల్యేకు వినతి అందజేశారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

కొత్తవలస : ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయాన్ని వియ్యంపేట, ఎస్.కోట ప్రాజెక్టుల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు ముట్టడించారు. సిఐటియు నాయకులు గాడి అప్పారావు, మద్దెల రమణ, వియ్యంపేట ప్రాజెక్టు అధ్యక్షురాలు కాకర తులసి ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు. **శృంగవరపుకోట :** ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నివాసం వద్ద అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ఆధ్వర్యాన వినతి అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలపై ముఖ్యమంత్రితో మాట్లాడుతానని తెలిపారు. సమ్మెకు జనసేన నాయకులు వబ్బిన సత్యనారాయణ, గంధవరపు సతీష్, రుద్రనాయుడు, లోక్‌సత్తా నాయకులు కాండ్రేగుకుల ప్రసాద్ మద్దతు తెలిపారు.

అంగన్‌వాడీల పొర్లు దండలు

భోగాపురం : సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడుతామని సిఐటియు జిల్లా కార్యదర్శి బి. సూర్యనారాయణ అన్నారు. అంగన్వాడీలంతా సమ్మె శిబిరంలో పొర్లుదండాలు పెట్టి నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు కష్ణవేణి, కొర్లమ్మ, శ్రీదేవి, ప్రవీణ, అనిత పాల్గొన్నారు. **గంట్యాడ :** కోనసీమ జిల్లా ముమ్మిడివరం ప్రాజెక్టు ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లిలో అంగన్‌వాడీ ఆయా మృతికి సమ్మె శిబిరంలో నివాళులర్పించారు. రమణమ్మ కుటుంబానికి పరిహారం చెల్లించాలని కోరారు.

విజయనగరం : అంగన్వాడీల సమస్యలు వింటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

నేటి నుంచి మంత్రి బొత్స జిల్లా పర్యటన

ప్రజాశక్తి–విజయనగరం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం నుంచి జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రి ఈనెల 28న ఉదయం జిల్లాకు చేరుకుంటారు. ఆరోజు మధ్యాహ్నం 3గంటలకు గుర్ల మండలం కొండగండ్రేడు చేరుకొని గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతుభరోసా కేంద్రం భవనాలను, తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తారు. ఇళ్లపట్టాల పంపిణీ చేపట్టడంతోపాటు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు రామలింగాపురం చేరుకొని విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం, సొసైటీ గోడౌన్, సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్ర భవనాలను ప్రారంభించి గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. 29న ఉదయం 10.30కు జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలోపాల్గొంటారు. మధ్యాహ్నం 4 గంటలకు గరివిడి మండలం వెదుళ్లవలసలో బిటి రోడ్డు ప్రారంభం, విద్యుత్ సబ్‌స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం అక్కడ బహిరంగసభలో ప్రసంగిస్తారు.

30న మెరకముడిదాం మండలం శాతంవలసలో పెరుమాలి వరకు నిర్మించిన రోడ్డును, రైతుభరోసా కేంద్రం, గ్రామ సచివాలయం భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం బహిరంగసభలో పాల్గొంటారు. 31న ఉదయం 10.30 గంటలకు బొబ్బిలి మండలం పక్కిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు విజయనగరం చేరుకుంటారు.

బ్రిడ్జి కోర్సులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి–విజయనగరం కోట

జనవరి 2 నుండి 31 వ తేదీ వరకు ప్రభుత్వ , ప్రైవేటు ఐటిఐ కళాశాలలో నిర్వహించే బ్రిడ్జి కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ టి.వి. గిరి కోరారు. ఏదైనా కోర్సులో రెండేళ్ల ఐటిఐ కోర్సులో శిక్షణ పొంది 60 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులకు బ్రిడ్జి కోర్సుకు అర్హత ఉంటుందన్నారు. కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు మాత్రమే ఎస్‌బి టెట్ నిర్వహించే టెస్టు కు అర్హులవుతారన్నారు. తద్వారా విద్యార్థులు నేరుగా పాలిటెక్నిక్ 2 వ సంవత్సరంలో చేరవచ్చునన్నారు. బ్రిడ్జి కోర్సు కోసం ఐటిఐ కళాశాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు సెల్ 8106025022 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

జూనియర్ డాక్టర్ల ధర్నా

ప్రజాశక్తి–విజయనగరంకోట

ప్రభుత్వం ఏడు నెలలుగా బకాయి ఉన్న స్టయిఫండ్‌ను చెల్లించాలని కోరుతూ జూనియర్ వైద్యులు సర్వజన హాస్పిటల్ ఎదుట బుధవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము మెడికల్ కళాశాలలో చేరినప్పుడు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చేరితే స్టయిఫండ్ ఇస్తామని చెప్పారని, ఏడు నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందారు. 7 నెలలకు గాను ఒక్కొక్క డాక్టర్ కు రూ.1,57,500 రావాల్సి ఉందన్నారు. ఇంతింత డబ్బులు పెట్టుకొని ఉద్యోగాలు చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉందన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లైన భోగాపురం, సారిక తదితర చోట్ల తమకు డ్యూటీలు వేస్తున్నారని, అక్కడ ఎటువంటి భోజన సౌకర్యం గాని, విశ్రాంతి సౌకర్యాలు గాని ఏర్పాటు చేయలేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో 150 మంది జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు. జూడోల విజయనగరం అధ్యక్షులు డాక్టర్ భార్గవ్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శరత్, డాక్టర్ దివ్య, కీర్తన రెడ్డి, డాక్టర్లు పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న జూనియర్ డాక్టర్లు

టిడిపి నాయకుల మద్దతు

జూనియర్ డాక్టర్ల ధర్నాకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.అతిథి గజపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర అధ్యక్షుల ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు తదితరులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అతిథి గజపతి మాట్లాడుతూ ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ప్రకారం నెలకు 25, 750 ఇవ్వవలసి ఉందన్నారు.

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలేవీ అమలు చేయరని మండిపడ్డారు. రాష్ట్రమంతటా జూనియర్ డాక్టర్లకు ఇటీవల బెంగాల్ రాష్ట్రంలోను, పక్కనే ఉన్న తెలంగాణాలోనూ స్టయిఫండ్ చెల్లించారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జూనియర్ డాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

8వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశకి–విజయనగరం టౌన్

సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 8వ రోజుకి చేరుకుంది. సమ్మెకు మద్దతు తెలిపిన సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని లేకుంటే ప్రభుత్వానకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేసి, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. యంటియస్ అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి ప్రతి నెలా 1వ తేదీకి వేతనాలు చెల్లించి, వార్షిక బడ్జెట్ ఒకేసారి విడుదల చేయాలన్నారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకూ సిపిఎం అండగా ఉంటుందన్నారు. ధర్నాలో రాష్ట్ర కార్యదర్శి గురువులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సర్వశిక్ష ఉద్యోగుల సమ్మెలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి – నెల్లిమర్ల

నూతన వైద్యాధికారులు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. బుదవారం నగర పంచాయతీ పరిధి జరజాపు పేట అర్బన్ హెల్త్ సెంటర్లో నూతనంగా విధుల్లో చేరిన వైద్యాధికార్లకు శాఖా పరమైన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా విధుల్లో చేరిన వైద్యాధికారులు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. కోవిడ్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసి నివారణకు కృషి చేయాలన్నారు. ఇంటింటికీ ఎల్‌సిడిసి కార్యక్రమం పక్కగా నిర్వహించాలని సూచించారు. అనంతరం మిమ్స్ ఆసుపత్రిలో కొవిడ్ విఆర్‌ఎల్‌డి ల్యాబ్‌ని, గ్రామంలో జరుగుతున్న ఎన్‌సిడిపిఒను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అదనపు డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఓకె.రాణి, డిప్యూటి డి ఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్. సూర్యనారాయణ, జిల్లా టీకా అధికారి డాక్టర్ ఆర్. అచ్యుత్ కుమారి, ఎన్‌సిడిపిఒ డాక్టర్ రవి కుమార్, డి ఎంఒ మణికుమారి పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యుత్ ఉద్యోగులకు ఎస్‌ఇ అభినందన

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

ప్రకాశం జిల్లా రామయ్యపట్నంలో ఈనెల 24,25తేదీల్లో జరిగిన 43వ రాష్ట్ర.స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యుత్ శాఖ ఉద్యోగులను ఎస్‌ఇ లక్ష్మణరావు, ఇఇ పి.హరి అభినందించారు. రికార్డు అసిస్టెంట్ పి.పైడి రాజు 5వేల మీటర్స్ వాకింగ్‌లో గోల్డ్ మెడల్, 200, 400 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్, 400 మీటర్ల రిలేలో సిల్వర్ మెడల్ సాధించారు. ఎల్.కోట సెక్షన్‌లో పనిచేస్తున్న గ్రేడ్2 జెఎల్‌ఎం పి.మణిబాబు ఆలిండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ సీనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

పండక్కీ పప్పన్నం కరువేనా?

- కందిపప్పు పంపిణీ లక్ష్యం 14,500 మెట్రిక్ టన్నులు
- కేటాయింపు 8వేల మెట్రిక్ టన్నులే
- ఏప్రిల్ నుంచి నాలుగో వంతే సరఫరా

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

పేద, మధ్య తరగతి ప్రజలు సంక్రాంతి పండక్కి కూడా పప్పు అన్నం తినే పరిస్థితి కనిపించడం లేదు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఈఏడాది ఏప్రిల్ నుంచి 17శాతం నుంచి 20శాతానికి మించి కందిపప్పు ఇవ్వని పరిస్థితి అందరికీ తెలిసిందే. కనీసం సంక్రాంతికైనా కందిపప్పు అందకపోతుందా? అని ఎదురు చూస్తున్నవారికి నిరాశ తప్పేట్టు లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రేషన్ కార్డుదారులకు ప్రతి నెలా సుమారు 14,500 మెట్రిక్ టన్నుల కందిపప్పు పంపిణీ చేయాల్సివుంది. చాలా రాష్ట్రాల్లో 5 నుంచి 12 రకాల నిత్యవసర సరుకులు అందజేస్తున్నప్పటికీ మన రాష్ట్రంలో బియ్యం, పంచదార, గోదుమ పిండి, కందిపప్పు మాత్రమే సరఫరా జరుగుతోంది. ఇందులోనూ కందిపప్పు సరిపడినంతగా కేటాయించడం లేదు. ఫలితంగా దాదాపు 80శాతం మంది కందిపప్పునకు నోచుకోవడం లేదు. వాస్తవానికి సరుకులన్నీ ప్రతి నెలా 1వ తేదీ నుంచి 17లోపు అందజేయాల్సివుంది. ఈలెక్కన ఈపాటికే జిల్లా పౌరసరఫరాల గిడ్డంగులకు చేరాల్సివుంది. నెలాఖరులోపు ఎంఎల్‌ఎస్ పాయింట్లకు, అక్కడి నుంచి గ్రామ, వార్డు స్థాయిల్లో ఉన్న చౌకధరల దుకాణాలకు చేరాల్సివుంది. ఇలా సమయానుకూలంగా సరుకులు రేషన్ డీలర్లకు చేరితే తప్ప, 1వ తేదీ నుంచి మొబైల్ డిస్పెనరీ యూనిట్లు (ఎండిసి)ల ద్వారా సరుకుల పంపిణీ సాధ్యం కాదు. ఈలెక్కన బియ్యం, పంచదార, గోదుమపిండి పూర్తిస్థాయిలో జిల్లాలకు చేరినప్పటికీ, కంది పప్పు మాత్రం సగమే చేరింది. రాష్ట్ర వ్యాప్తంగా 14,500 మెట్రిక్ టన్నులు సరఫరా కావాల్సివుండగా, ఇప్పటి వరకు కేవలం 8వేల మెట్రిక్ టన్నులు మాత్రమే జిల్లాలకు చేరింది. ఇందులోనూ ఎంఎల్‌ఎస్ పాయింట్లకు చేరింది కేవలం 3,428 మెట్రిక్ టన్నులే. విజయనగరం జిల్లాలో 5లక్షల 81వేల రేషన్ కార్డులు ఉన్నాయి. వీరందరికీ ఒకొక్క కేజీ చొప్పున 5.81 మెట్రిక్ టన్నుల కందిపప్పు అందజేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 2.75 మెట్రిక్ టన్నులు మాత్రమే జిల్లాకు చేరింది. మరోవైపు కందిపప్పు కేజీ ధర మార్కెట్‌లో రూ.200 పలుకుతోంది. ఇంతసొమ్ము పెట్టి సామాన్యులు కొనుక్కునే పరిస్థితి లేదు. ఈనేపథ్యంలో సంక్రాంతిలోనూ పప్పు అన్నం తినే పరిస్థితి లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఔను..! ఏప్రిల్ నుంచి కందిపప్పు కొరతే

ఔను..! ఏప్రిల్ నుంచి కందిపప్పు కొరత ఉంది. మన జిల్లాలో ప్రతి నెలా 17శాతం 20శాతం మందికి మాత్రమే కంది పప్పు అందజేశాం. కొరత ఉండడం వల్ల ప్రభుత్వం నుంచి సరిపడినంతగా రావడం లేదు. వచ్చినంత వరకు పంపిణీ చేస్తున్నాం. సంక్రాంతి పండగ నేపథ్యంలో అందరికీ కందిపప్పు ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్టు ఉన్నతాధికారుల నుంచి సమాచారం వచ్చింది. జిల్లాకు 5.81 మెట్రిక్ టన్నుల రావాల్సి వుండగా ఇప్పటి వరకు 2.75 మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరింది. 1వ తేదీ నుంచి పంపిణీ చేపట్టాల్సివుంది.

కె.మధుసూదనరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి

3,4 తేదీల్లో బాలోత్సవం

ప్రజాశక్తి–విజయనగరం కోట

జనవరి 3,4 తేదీల్లో విజయనగరం బాలోత్సవం పేరిట ఆనంద గజపతి ఆడిటోరియంలో పిల్లల పండగ నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం కమిటీ అధ్యక్షులు జిఎస్ చలం, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం గురజాడ అప్పారావు నివాసంలో ఇందుకు సంబంధించిన బాలోత్సవం పిల్లల పండగ బ్రోచర్‌ను డిప్యూటీ డిఇఒ ఆర్.వాసుదేవరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలోత్సవం పేరిట పాఠశాలల్లో పిల్లలకు పలు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు నాలుగెస్సుల రాజు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వలన పిల్లల్లో ఉన్న నిగూఢమైన శక్తులు బయటకు రావడానికి అవకాశం ఉంటుందన్నారు ప్రతి వ్యక్తి మంచి వ్యక్తిత్వం రావాలంటే మంచి పుస్తకం చదవాలన్నారు. బాలోత్సవం అధ్యక్షులు జి.ఎస్.చలం మాట్లాడుతూ పిల్లల్లోని కళలు, నైపుణ్యాలను బయటకు తీయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసరావు, ఆహ్వాన సంఘం చైర్మన్ ధవళ సర్వేశ్వరరావు, విజయనగరం ఎంఇఒ–2 పి. సత్యవతి, జక్కు రామకృష్ణ, గురజాడ వారసులు ఇందిర, భోగరాజు సూర్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న కమిటీసభ్యులు, చిన్నారులు

పార్టీ బలోపేతానికి కృషి : కొండపల్లి

ప్రజాశక్తి- గంట్యాడ


మాట్లాడుతున్న కొండలరావు, శ్రీను

నియోజకవర్గం పరిధిలో టిడిపి బలోపేతానికి కృషి చేస్తామని మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు అన్నారు. బుధవారం గంట్యాడలోని తన నివాసం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు, గజపతినగరం నియోజవర్గం టిడిపి ఇన్చార్జి కొండపల్లి అప్పలనాయుడు ఆదేశాల మేరకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎటువంటి బేదాభిప్రాయాలు లేకుండా కార్యకర్తలను, నాయకులను కలుపుకొని పని చేస్తామన్నారు. క్యాడర్‌ను తయారు చేసి యువతను ప్రోత్సహించి నియోజకవర్గం పరిధిలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కొండపల్లి శ్రీను మాట్లాడుతూ పార్టీని ముందుకు తీసుకువెళ్లడానికి మరింత కృషి చేస్తామని అందుకే పార్టీలో చేరామని చెప్పారు. వ్యక్తిగత అపోహాలను పక్కనపెట్టి ఎటువంటి స్వార్థం లేకుండా అందర్నీ కలుపుకొని పార్టీని ముందుకు తీసుకువెళ్తామన్నారు. నియోజకవర్గ పరిధిలో కొండపల్లి అప్పలనాయుడుకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన మద్దతు ఇస్తామని, తమకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన ఆయన మద్దతు ఇస్తారని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు సంక్రాంతి మాధవ స్వామి పాల్గొన్నారు.

సంజీవినాయుడు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- రామభద్రపురం

మెటీరియల్ అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ నాయకులు కె.శేషగిరి తండ్రి కోరెడ్ల సంజీవినాయుడు విద్యారంగ అభివృద్ధికి చేసిన సేవలు అభినందనీయమని ఎంఇఒలు తిరుమలప్రసాద్, పెంటయ్య అన్నారు. సంజీవినాయుడు 5వ వర్ధంతి సందర్భంగా ఆరికతోట హైస్కూల్‌లో బుధవారం యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెవివి ఉపాధ్యక్షులు పి.సత్యంనాయుడు, యుటిఎఫ్ నాయకులు విజయగౌరి, కేశవ రావు, శ్రీరాములు నాయుడు, లక్ష్మణ్, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ముద్రించిన మోడల్ టెస్టు పేపర్లను ఉచితంగా పంపిణీ చేశారు.

ఆంగ్ల నైపుణ్యంతో ఉత్తమ ప్రతిభ

విజయనగరం టౌన్: తోటపాలెంలోని సత్యా డిగ్రీ, పీజీ కళాశాలలో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై బుధవారం సెమినార్ నిర్వహించారు. సీతం ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.సతీష్ కుమార్ కమ్యూనికేషన్ టీవీషన్ స్కిల్స్ గురించి మార్గనిర్దేశం చేశారు. జీవితంలో విజయం సాధించాలంటే, లక్ష్యాలను చేరుకోవడానికి విద్యార్థులతో పాటు ఆంగ్ల నైపుణ్యాలు తప్పనిసరి అని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ సరిగా చెయ్యలేకపోతే ఇంటర్వ్యూలో విజయం సాధించడం కష్టమని అన్నారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు

వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు తప్పని ఇబ్బందులు

భోగాపురం: వైసిపి ప్రభుత్వం హయాంలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. బుధవారం ఆయన పోలిపల్లిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మద్యపానం నిషేధం చేస్తానని చెప్పి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. అంగన్వాడీలకు మాట ఇచ్చి తప్పిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పి నిరుద్యోగ యువకులను మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి అభివృద్ధి లేకుండా చేశారన్నారు. రానున్న రోజుల్లో వైసిపిని ఓడించి తెలుగుదేశాన్ని అధికారంలోకి తీసుకువచ్చి చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు.

పైడిరాజుకు అభినందన

నెల్లిమర్ల: 43వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెట్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో నాలుగు మెడల్స్ సాధించిన పి.పైడిరాజుని నెల్లిమర్ల షటిల్ బ్యాడ్మింటెన్ అసోసియేషన్ అభినందించింది. ప్రకాశం జిల్లా రామయ్యపట్నం హైస్కూల్ గ్రౌండులో ఈ నెల 24,25 తేదీలలో ఈ పోటీలు జరిగాయి. విజయనగరం జిల్లా తరుపున పాల్గొన్న పైడిరాజు 5000 మీటర్ల వాకింగ్‌లో గోల్డ్ మెడల్, 200 మీటర్ల రన్నింగ్‌లో సిల్వర్, 400 మీటర్ల రన్నింగ్‌లో సిల్వర్, రిలే రన్నింగ్‌లో సిల్వర్ మెడల్‌ని సాధించారు. పైడిరాజు విద్యుత్ శాఖలో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేయడమే కాకుండా నెల్లిమర్ల షెటిల్ బ్యాడ్మింటెన్ అసోసియేషన్ అధ్యక్షుడుగా కూడా ఉన్నారు. పైడిరాజు నాలుగు మెడల్స్ సాధించడం తమకెంతో గర్వకారణమని అసోసియేషన్ అభిప్రాయపడి అభినందించింది. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటెన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.ఎం.కె. లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు బయిరెడ్డి సంతోష్, పంచాది కళ్యాణ్, కోశాధికారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా మేట్లకు శిక్షణ

తెర్లాం: మండలంలోని ఉపాధి హామీలో పనిచేస్తున్న మహిళా మేట్లకు శిక్షణా కార్యక్రమాన్ని ఎపిఒ సుశీల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి ఉమాలక్ష్మి, ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వేతన దారులకు 100 రోజుల పని కల్పించటంతో పాటుగా గ్రామాలలో సుస్థిర ఆస్తులను నెలకొల్పటానికి ఉపాధి హామీ పనులు దోహదపడుతు న్నాయన్నారు. మేట్లు వేతనదారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మస్టర్లు వేయాలన్నారు. వేతనదారుకి ఇచ్చిన కొలతలను పూర్తిచేసి గరిష్ట వేతనం పొందడానికి ప్రభుత్వం ఏర్పరచిన వ్యవస్థే మేట్లని, క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి మస్టర్లు, పని ప్రదేశాలలో వసతుల కల్పన చేయాలని సూచించారు. మహిళా మేట్లు టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గత సమస్యలను పరిష్కరించాలి

తెర్లాం: గత సమావేశంలో వచ్చిన సమస్యలను ముందుగా పరిష్కరించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి ఉమాలక్ష్మీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పలు శాఖలపై రివ్యూ నిర్వహించారు. విద్య, వైద్యం, హౌసింగ్, తాగునీరు, ఎలక్ట్రికల్, అగ్రికల్చరల్ శాఖల మీద అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలే ఉన్న తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి లుర్థు, ఎఎంసి చైర్మన్ బి. శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి సత్యనారాయణ, రమాదేవి, అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

వేపాడ: మండలంలో పనిచేస్తున్న వాలంటీర్లందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వాలంటీర్లు డిమాండ్‌చ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపిడిఒ పట్నాయక్‌కు వినతి పత్రాన్ని అందించారు. తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించ కపోతే ఈ నెల 28 తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామని అప్పటికీ పరిష్కారం కాకపోతే 29వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు సిహెచ్ రామకృష్ణ, కె. స్వర్ణకుమారి, పి. సౌందర్య, పి.శ్రామిక, కె.కన్నారావు, కె.లత, డి.శాంతికుమారి, టి. శ్రీదేవులు పాల్గొన్నారు.

పాఠశాలకు వస్తువులు బహూకరణ

వేపాడ: మండలంలోని బల్లంకి ప్రాథమిక పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి, ప్రస్తుత ఉపాధ్యాయుడు తాడాన అప్పారావు, విజయ కుమారి దంపతులు తమ తల్లిదండ్రుల చేతుల మీదుగా ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ పదివేల రూపాయలు విలువ చేసే పెన్నులు, స్కేలు, జామెంట్రీ బాక్స్‌ను బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు ఇమంది, జగదీశ్వర్ రావు, ఎన్.శ్రీరాములు, ఎస్.అప్పారావు, పిసి కమిటీ చైర్మన్ రావు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

వంగర: మండలంలోని కొండ చాకరాపల్లిలో బెవర రమేష్ నాయుడు, బెవర భాస్కరరావు ఆధ్వర్యంలో పలువురు వైసిపిని వీడి టిడిపిలో బుధవారం చేరారు. వీరందరికీ రాజాం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి కోండ్రు మురళీమోహన్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండచాకరాపల్లి గ్రామానికి చెందిన రమేష్ నాయుడు, భాస్కరరావు మాట్లాడుతూ వైసిపిలో వివక్షకు గురై ఎన్నో ఇబ్బందులు పడ్డామని అందువల్ల టిడిపిలో చేరుతున్నామని చెప్పారు. టిడిపి సీనియర్ నాయకులు బొచ్చ వాసుదేవరావునాయుడు, లచ్చుబుక్త కృష్ణ మూర్తి, పిన్నింటి మోహనరావు, నియోజకవర్గం ఎస్‌సిసెల్ అధ్యక్షులు మజ్జి గణపతి, నాలుగు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

బకాయిలకై ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి- శృంగవరపుకోట

డిఎ, పిఆర్‌సి బకాయిల సాధన కోసం ఉపాధ్యాయులు యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం తహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, కార్యదర్శి రాజగోపాల్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కోట ఉపాధ్యాయులు జీవీ రమణ, గూనూరు వెంకట్రావు, ఆశకపు శ్రీనివాసరావు, ఎంవిఎస్ నారాయణ, డి. తిరుపతిరావు, ఎవి లక్ష్మి, జామి ఉపాధ్యాయులు ఎం. తాతంనాయుడు, వి. వాసుదేవరావు, జి. రాజారావు, కే. వెంకట్రావు, వేపాడ నుంచి ఇమంది జగదీశ్వరరావు, రామసత్యం, కొత్తవలస నుంచి వెంకట్ నాయుడు, విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని భోగాపురం యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఉపాధ్యాయులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ 2023 నాటికి 18 వేల కోట్లు తమకు రావాల్సిన బకాయిలు ఉన్నాయని అన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలు కూడా ఇంతవరకు ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ప్రతి నెల ఒకటో తేదీ జీతాలు వచ్చే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు ఎన్

విజయనగరం: కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్, కే శ్రీనివాసరావు, సురేష్ కుమార్, కుసమకుమారి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుండి రావాల్సిన డీఏ, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పిఆర్‌సి తదితర ఆర్థిక బకాయిలు సుమారు రూ.18,096 కోట్లుగా ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. తాలూకా కేంద్రంలో 6గంటల ధర్నా కార్యక్రమం సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయగౌరి, జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, సీనియర్ నాయకులు అజయ్ కుమార్, సత్యన్నారాయణ, మండలం, పట్టణ నాయకులు బత్తుల శ్రీనివాస్, సుధాకర్, శంకరరావు, రామారావు, జ్యోతి, కస్తూరి, శుభలక్ష్మి, కామేశ్వరి, మహేష్, రాధాకృష్ణ, చిట్టి బాబు, పెద్ద సంఖ్యలో నియోజకవర్గ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సాయంత్రం యుటిఎఫ్ ఆధ్వర్యంలో విజయనగరం తాలూకా కేంద్రంలో కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధర్నా శిబిరానికి సిహెచ్ తిరుపతి నాయుడు అధ్యక్షత వహించగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఆర్సి పట్నాయక్, జెఎవిఆర్కె ఈశ్వరరావు లు మాట్లాడుతూ పిఆర్సి, డిఎ ఎరియర్లు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ లోన్లు సరెండర్ లీవ్ వంటి ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే జిల్లా స్థాయిలో జనవరి 3వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో జిల్లా కార్యదర్శులు ఎన్ సత్యనారాయణ, పి వాసుదేవరావు, జిల్లా ఆడిట్ కమిటీ మెంబరు పి శ్రీనివాసరావు, విజయనగరం టౌను, విజయనగరం రూరల్, గంట్యాడ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తూచ్.. సమ్మె లేదు..
వెనక్కి తగ్గిన మహిళా వాలంటీర్లు

భోగాపురం : సమ్మె చేస్తున్నామని ఎంపిడిఒకు నోటీసు ఇచ్చి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని బహిష్కరించిన భోగాపురం వాలంటీర్లు తూచ్ అంటూ.. మేం సమ్మెకు వెళ్లడం లేదని మండల పరిషత్ ఎఒకు బుధవారం మరో నోటీసు ఇవ్వడం చర్చనీయాంశమైంది. రాష్ట్ర యూనియన్ అధికారంగా ప్రకటిస్తే సమ్మెలోకి వెళ్తామని చెప్పారు. అప్పటి వరకు విధుల్లో పాల్గొంటున్నట్లు నోటీసులో పేర్కొన్నారు సమ్మె విరమించుకున్నట్లు ప్రకటించిన వారి లో కేవలం మహిళా వాలంటీర్లే ఉండటం విశేషం.

ఇవిఎంలపై అవగాహన

నెల్లిమర్ల: ఇవిఎంల ద్వారా ఓటు వేయడంపై రెవెన్యు అధికార్లు బుధవారం రామతీర్థం సచివాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ ఆర్.సత్యారావు ఓటు హక్కు ఉన్నవారిని ఇవిఎంల ద్వారా ఓటు హక్కు వినియోగంపై ప్రయోగాత్మకంగా వివరిం చారు. ఇవిఎంలపై ఎటువంటి అపోహలు కలగ కుండా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పి ంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంచరాపు రాము, విఆర్ఎ ఎన్. సూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

మండలానికో బ్రాంచ్

భోగాపురం : ప్రతి మండలంలో ఒక బ్రాంచ్ ఏర్పాటు చేయడమే డిసిసిబి లక్ష్మమని చైర్మన్ వేచలపు చినరామునాయుడు అన్నారు. మండలంలోని సవరవల్లి గ్రామంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచ్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు డిసిసిబికి ఈ బ్రాంచ్‌తో కలిపి 22 బ్రాంచ్‌లున్నాయన్నారు. ప్రతి మండ లంలో ఒక బ్రాంచ్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ బ్యాంకు ద్వారా అన్ని రకాల రుణాలు తక్కువ వడ్డీతో అందజేస్తారన్నారు. మన ప్రాంతంలో పెట్టడం వల్ల మనమంతా బ్యాంక్ అభివృద్ధికి సహకరించాల న్నారు. వాహనాలు, స్థలాలు, ఇళ్లపై కూడా రుణాలు అందజేస్తారన్నారు. అనంతరం పోలిపల్లి గ్రామానికి చెందిన మహిళా సంఘానికి రూ.20లక్షలు చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, సిఇఒ జనార్ధన్‌రావు, ఎంపిడిఒ అప్పలనాయుడు, డిటీ శ్రీనివాసరావు, సర్పంచ్ ఉప్పాడ విజయ భాస్కరరెడ్డి, బ్రాంచ్ మేనేజర్ రమేష్, శ్రీలత, జిఎంలు ఉమామహేశ్వరరావు, వాసు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చొని నిరసన

- 2వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికుల సమ్మె బుధవారం 2వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిల్చొని మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగన్మోహన్ రావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు జగనన్న చేసిన నమ్మకద్రోహాన్ని ఖండిస్తూ మోకాళ్ళపై నిల్చుని నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి రవణమ్మ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి. రమణ, నాయకులు రమా కుమారి, ఈశ్వరమ్మ, గౌరీ, శంకర్రావు, సూర్యనారాయణ, వంశీ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

రాజాం : అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిల్చొని మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరారు. యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, అనిల్ కుమార్, లక్ష్మి, గురువులు, రాంబాబు, వెంకటి, గోపి, రాజేష్, కనకరాజు పాల్గొన్నారు.

బొబ్బిలి : మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు మాట్లాడారు.

నెల్లిమర్ల: ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్మికుల చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మోకాళ్ళ పై నిరసన తెలిపారు. కిల్లంపల్లి రామారావు మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు, ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్, డ్రైవర్లకు ఆక్యు పెన్స్ అలవేన్స్ ఇవ్వాలని కోరారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో మున్సిపల్ యూనియన్ నాయకులు టి. బాబురావు, బి.హరిబాబు, జె. శ్రీను, బి. రాము, టి. లక్ష్మి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-బొబ్బిలి, రామభద్రపురం, గజపతినగరం

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆమె బుధవారం బొబ్బిలి, రామభద్రాపురం, గజపతినగరం మండలాల్లో పర్యటించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను, ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లలో లోపాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేటలో బ్యాడ్మింటెన్, పాతబొబ్బిలిలో వాలీబాల్ పోటీలను కలెక్టర్ పరిశీలించారు. రామభద్రపురం జెడ్‌పి పాఠశాలలో నిర్వహిస్తున్న బ్యాడ్మింటెన్, కబడ్డీ పోటీలను, ఆరికతోట నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను, గజపతినగరం మండలం మరుపిల్లి జెడ్‌పి పాఠశాలలో నిర్వహిస్తున్న కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటెన్, ఖోఖో పోటీలను కలెక్టర్ తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడలు జరుగుతున్నప్పుడే వెంటవెంటనే ఫోటోలను, వివరాలను, లైవ్ స్కోర్‌ను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పర్యటనలో బొబ్బిలి

గజపతినగరం: సూచనలు చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, తాహాశీల్దార్ డోల రాజేశ్వరరావు, ఎంపిడిఒ పి.రవికుమార్, రామభద్రాపురం ప్రత్యేకాధికారి గోవిందరావు, తాహాశీల్దార్ సులోచనా రాణి, ఎంపిడిఒ రమామణి, గజపతినగరం ప్రత్యేకాధికారి రమేష్, ఎంపిడిఒ కె.కిశోర్‌కుమార్, ఆయా మండలాల ఎంఇఒలు, పిఇటిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి - భోగాపురం

గ్రామాలను అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి లక్ష్యమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చెరుకుపల్లి సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న పథకాలు గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అంతకుముందు రూ.40 లక్షలతో నిర్మించిన సిమెంట్ రహదారిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఎంపిడిఒ ఎన్ అప్పలనాయుడు, తహాశీల్దార్ చింతాడ బంగార్రాజు, ఉప సర్పంచ్ రాయి ఈశ్వరరావు, నాయకులు పడాల భాను, సుందర హరీష్, అప్పురుబుక్త పైడినాయుడు, గుజ్జు రవణ, దాసరి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మరొకసారి ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సచివాలయం-1 పరిధిలో పుణ్యగిరి, రేగ పుణ్యగిరి గ్రామాల్లో 298వ రోజు బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపలోకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, నాయకులు కూనిరెడ్డి వెంకటరావు, పట్టణ అధ్యక్షుడు రెహమాన్, ఎంపిటిసి దారగిరి, కడారి అప్పయ్య, మజ్జి శేఖర్, సీదరి అర్జున్, బార్నో, నారాయణ మూర్తి, పెనుగంటి జగదీష్, సోషల్ మీడియా కోకన్వీనర్ మామిడిబుజ్జి, కడారి జయశంకర్, తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

గిన్నిస్ బుక్ రికార్డులో చిన్నారులకు స్థానం

ప్రజాశక్తి- బొబ్బిలి

గిన్నిస్ బుక్ రికార్డులో బొబ్బిలి పట్టణానికి చెందిన ఇద్దరు చిన్నారులు స్థానం సాధించారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 24న భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గిన్నిస్ బుక్ రికార్డు కోసం జరిగిన కూచిపూడి నృత్యంలో స్వామివారివీధికి చెందిన రెడ్డి చాందిని, పూల్ బాగ్ కాలనీకు చెందిన కోటగిరి లక్ష్మిసహస్ర పాల్గొని తన ప్రతిభను కనబరిచారు. గిన్నిస్ బుక్ రికార్డు కోసం అధికారికంగా 3,782 మంది చిన్నారులు నృత్యం చేయగా చాందిని, లక్ష్మిసహస్ర పాల్గొని కూచిపూడి చేసి గిన్నిస్ బుక్ రికార్డులో స్థానం సాధించారు. చాందిని కోనా రవి, లక్ష్మిసహస్ర జి.వాణిపద్మజ వద్ద కూచిపూడి నేర్చుకుంటున్నారు. చాందిని తండ్రి రెడ్డి రవీంద్ర వస్త్రాలు వ్యాపారం చేయగా, తల్లి సంతోషికుమారి గృహిణి, లక్ష్మిసహస్ర తండ్రి హర్ష సాఫ్ట్వేర్ ఉద్యోగం చేయగా తల్లి మానస గృహిణి. చాందిని, లక్ష్మిసహస్ర గిన్నిస్ బుక్ రికార్డులో స్థానం సాధించడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


బొబ్బిలి: చాందిని, లక్ష్మిసహస్ర

నెల్లిమర్ల: గుణశ్రీ

నెల్లిమర్ల: సారిపల్లి గ్రామానికి చెందిన కొవ్వాడ గుణశ్రీ కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబర్చి గిన్నీస్ బుక్‌లో చోటు సంపాదించింది. హైదరబాద్ గచ్చిబౌలి జిఎంసి బాలయోగి స్టేడియం లో భారత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన కూచిపూడి బృంద నృత్య పోటీల్లో గుణశ్రీ ప్రతిభ కనబర్చి గిన్నీస్ బుక్‌లో స్థానం సాధించింది. గుణశ్రీ తండ్రి బ్యాంక్ ఉద్యోగి, తల్లి గృహిణి. విశాఖలో బి. శిరిషారాణి శిక్షణలో కూచిపూడి నృత్యంలో ప్రావీణ్యం పొందింది.

ట్యాబులు పంపిణీ

ప్రజాశక్తి - దెంకాడ

ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం కోరారు. డెంకాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బుధవారం ఆయన చేతులు మీదుగా ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఈ ట్యాబ్‌లు ఎంతో ఉపయోగపడతాయని వీటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యలో ముందుకు సాగాలని కోరారు. ముందుగా పాఠశాలలో ఆడదాం ఆంధ్ర కార్యక్రమాన్ని సచివాలయ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతివాడ గౌరీ, కార్యదర్శి వాసు, రామకృష్ణ మాస్టర్, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డెంకాడ: ట్యాబ్ అందిస్తున్న రొంగలి

తెర్లాం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో సమానత్వం ఉండాలనే ఉద్దేశంతో, పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ఇంత చిత్తశుద్ధితో పనిచేస్తున్న జగన్మోహన్‌రెడ్డిని విద్యార్థుల తల్లిదండ్రులు నిండు మనసుతో ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, ఎంపిపి నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్‌పిటిసి గర్భాపు లుర్దు, వైస్ ఎంపిపి చెపేన సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షుడు తెంటు సత్యం నాయుడు, ఎంపిడిఒ శంబంగి రామకృష్ణ, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు, ఉపాధ్యాయులు, వివిధ గ్రామ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

భూహక్కు చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త భూహక్కు చట్టాన్ని (ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2023) తక్షణం ఉపసంహరించు కోవాలని ఎస్.కోట బార్ అసోసియేషన్ న్యాయ వాదులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్య దర్శులు అల్లు సత్యాజీ, డబ్ల్యుఎన్ శర్మ మాట్లాడుతూ ఈ చట్టంతో స్థానిక కోర్టులకు విచారణ పరిధి లేకుండా చేశారన్నారు. కేవలం టైటలింగ్ అధికారులకే అధికారం ఇవ్వడం వల్ల వీరిపై రాజకీయ జోక్యం పెరిగే అవకాశం ఉందని, పేద రైతులు మరింతగా ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు. ఇందుకు సంబంధించిన వాజ్యాలను హైకోర్టులో అప్పీలు చేసుకునే అవకాశం లేక పేద రైతులు ఇక్కట్లు పడతారన్నారు. రైతాంగ సమస్యలు, భూ సమస్యలు సత్వరం పరిష్కరించే యోచన ఉంటే కోర్టులు పెంచి, ఉద్యోగుల సంఖ్య పెంచి భూ కేసులను పరిష్కరించాలని సూచించారు. నూతన భూహక్కు చట్టం ఉపసంహరించాలని కోరుతూ ఈనెల 29వ తేదీ వరకు కోర్టు విధులు బహిష్కరణ కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు బి.త్రిమూర్తులు, జి.ప్రకాష్, వారాది ఈశ్వరరావు, టీవీఆర్ మూర్తి, జి.చిట్టిబాబు, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, బొడ్డు వెంకటరావు, బి.శివశేఖర్ బాబు, వసంత శ్రీనివాసరావు, బీవీఎస్ రామారావు, సంతోష్, కర్రి వెంకటరమణ, బొబ్బిలి రామకృష్ణ, అనూరాధ తదితరులు పాల్గొన్నారు..

కోర్టు బయట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కుష్టు రహిత సమాజాన్ని స్థాపిద్దాం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

కుష్టు రహిత సమాజాన్ని స్థాపిద్దామని పూసపాటిరేగ పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ రాజేష్ వర్మ, డాక్టర్ ప్రమీలా అన్నారు. బుధవారం సానిక పిహెచ్‌సి పరిధిలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బ ంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం నుండి జనవరి 2024 జనవరి 12వ తేది వరకూ గ్రామాల్లో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం నిర్వహించాలన్నారు. అందరికి స్పర్శ పరీక్ష, నరముల పరీక్షలు జరిపి వారిని సత్వరంగా ఆసుపత్రికి పంపించి చికిత్స నిర్వహిస్తామన్నారు. ప్రజలంతా కుష్టు వ్యాది నిర్మూలనకు సహకరించి అంగవైకల్య నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆర్‌వి రమణ, ఎఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఎంఇఒకు ఎండిఎం కార్మికుల వినతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండల పరిధిలో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని సిఐటియూ ఆధ్వర్యంలో ఎంఇఒ నర్సింగరావుకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు నేటికి 23 ఏళ్లగా ప్రభుత్వానికి ఇటు స్కూల్ పిల్లలకు సేవలు అందిస్తున్నారని, అటువంటి వీరికి మూడు నెలలు కావస్తున్న బకాయి జీతాలు, వంట సరుకుల బిల్లులు ఇంతవరకు చెల్లించలేదని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, బకాయి బిల్లులు, బకాయి జీతాలు ఇవ్వాలని, గుర్తింపు కార్డు, ఏకరూప దుస్తులు ఇవ్వాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని విధి నిర్వహణలో ప్రమాదం జరిగితే ప్రమాద బీమా ఐదు లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే వంటగ్యాస్ సరఫరా చేయాలని, ఈ పథకాన్ని స్వచ్ఛంద ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పరాదని కోరారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే నెలలో సమ్మెలోకి వెళ్తామని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ నాయకులు చెలికాని ముత్యాలు, మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం జిల్లా కమిటీ నాయకులు జె సన్యాసమ్మ, మండల కమిటీ సభ్యులు ఏ భవాని, డి లక్ష్మి, వై దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒకు వినతినిస్తున్న ఎండిఎం కార్మికులు

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT: SRUNGAVARAPU KOTA I.A.4/2023 in O.S.27/2021

Between:
Gulamjji Vara Lakshmi & another ...Petitioners/Plaintiffs
And
J. Ramulamma & others …Respondents/Defendants

NOTICE

To,
Proposed Respondent/Defendant:
R-10: Jami Venkata Ratnam,
W/o. Prasada Rao, Aged about 36 years, R/at Bheemasingi Village, Jami Mandal, Vizianagaram District.

Please take notice that the above-named petitioners/plaintiffs has instituted the above I.A.4/2023 in O.S.27/2021 against you and the matter stands posted to **05-01-2024** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **05-01-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

SARIKA HARIBABU,
Advocate, Vizianagaram,
Cell: 8919146166.